


# సత్యాగ్రహి సుమిత్రమ్మ—స్త్రీల హక్కులు

ఏప్రిల్ నెల వచ్చింది. ఎండలు ముదిరి కొద్దిగా గాడ్పులు సాగించాయి. ఓనాడు సాయంకాలము బయలు దేరి చాలరోజులునాడు చూచిన చెల్లెలు మంగమ్మను చూడటానికి వాళ్ళవూరు వెళ్ళాను. ఈ సోదరి తన స్వతంత్ర అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించుతుంది గాన ఆమెయెడల నాకు గౌరవం మెండు. ఆ రాత్రి వుక్కగా నుంటచే ఆరుబయటనే పరున్నాము. లోకాభిరామాయణం, కబుర్లు కొంతసేపు జరిగినతరువాత నిద్దుర పోయాను.

"సునిశితమతి వై శుభాంగ మేలుకో" అనేపాట హెచ్చు స్థాయిలో ఎవరో పాడుతున్నారు. నాకు మెలకువ వచ్చింది. బయటికి పోయిచూశాను. దేశ సేవికలు పాడుకొంటూ బజారునే వెళ్ళుచున్నారు. ఆ వూరివాళ్లు చాలమంది మేల్కొని వారిని చూడడానికి బయటికి వచ్చారు. దేశసేవికల వెంటనే యిద్దరు పోలీసులున్నారు మఫ్టీలో. గుడివాడలో పికెటింగు చేస్తూన్న వారిని, పోలీసులు మోటారు లారీలో ఎక్కించి ముదినేపల్లివైపు దింపినారట. అక్కడనుంచి వారు నడచిపోతున్నారు. అక్కడ జేరినవారితో నేను అన్నాను; స్వతంత్రాభిలాష ఎంత ఉత్సాహాన్ని శక్తినైనా యిస్తుంది. పాపం! ఎన్నడూ నడిచి యెరుగనివారు, అర్ధరాత్రివేళ ఎంతో దూరం ప్రయాణం చేస్తున్నారు, ఆశ్చర్యం గదా!

ఒక కాంగ్రెసు అభిమాని అన్నాడు:—నిజంగా సత్యాగ్రహోద్యమం ప్రజల్లో నూతనోత్తేజాన్ని కలుగజేస్తుంది. స్త్రీలుకూడా మండిపోయే వేసవికాలంలో పికెటింగుచేయడం, లాఠీదెబ్బలు తింటూ కూడా యువకులు ముందుకురావడం నూతన శక్తిని సూచిస్తున్నాయి.

ఒక సనాతనుడన్నాడు:—అఘోరించినట్టులే వుంది లెద్దురూ! ఏమిటబ్బా వచ్చింది! దెబ్బలు తింటేనూ, కావాలని జైలుకు పోతేనూ మాత్రమే వస్తుందేమిటి స్వరాజ్యం, ప్రభుత్వం వేళ్లు పాతుకొని వుంటేను. పైగా నేమో! స్త్రీలనుకూడా బజారుల కెక్కించారు.

కాంగ్రెసు అభిమాని:—ఆనకట్టకు పూర్వం కబుర్లు చెబితే యెలాగండి. స్వరాజ్యంకోసం అందరూ పోరాడాలిసిందే. ప్రజల్లో సగంమంది బానిసతనంలో వుంచిన మనం స్వాతంత్ర్యానికి అర్హుల మెలా అవుతాం?

శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు

చెల్లెలు మంగమ్మ:—ఏమో! ఇది స్త్రీలు పొందిన స్వాతంత్ర్యానికి చిహ్నమని నేను నమ్మను. పురుషుల ఆజ్ఞల్లో ఒక భాగంగానే, నేనంచుతాను, వారికోర్కెలు నెరవేర్చ డానికే స్వరాజ్యం కోసమని యేర్పరచి కార్యక్రమంలో యీ దేశ సేవికలు పాల్గొంటున్నారు.

నేను:—అల్లా అని నీవు మాపై చాలా అన్యాయంగా ఆరోపణలు చేస్తున్నావు. మా కాంగ్రెసువాళ్లు నిజంగా స్త్రీ స్వాతంత్ర్యాన్ని ఆమోదిస్తారు. వారి ఉద్యమాలకు తోడ్పడతారు.

చెల్లెలు మంగమ్మ:—'కబుర్లు కేమిలే! ఇపుడు ఉద్యమములోకివచ్చిన సోదరీమణులను, ఎంతమందిని తరువాత రాచకీయోద్యమాల్లో పనిచేయడానికి అవకాశమిస్తారో! చూస్తాంగా! అపుడు వీరినియింతగా కొనియాడే మీరు స్త్రీల హక్కు సత్వాలకోసం పోరాడే వారికి ఎంత సాయం చేస్తారో చూస్తానుగా' అంది.

* * *

సోదరిసుమిత్రమ్మ ఆదేశ సేవికలందరికి నాయకురాలు. వితంతువు. ఆదళంలో అందరికంటే ధైర్యవంతురాలు. పోలీసులు పిచకారీలతో మసిలేనీళ్లు వూపిరితిరుగకుండా ముఖముపై కొట్టినపుడూ ఆమె భీతినొందలేదు. ఆమె అచంచలత్వమే తక్కిన సోదరీమణులందరికి ధైర్యమునొసగి ఉద్యమాన్ని రేకొట్టించింది. సత్యాగ్రహోద్యమంలో తీవ్రంగా పనిచేయని కాంగ్రెసు నాయకులు, వాలంటీరులు ఆమెను చూడడానికి సిగ్గుపడేవారు. సూటిపోటు మాటలతో ఆమె యీసడించి వేస్తుందనే భయంతో ఆమె దగ్గరకు వెళ్లటానికే జడిసేవారు.

పోలీసులు దేశసేవికలను సాయంత్ర బస్సుపై ఎక్కించి చాలా దూరాన విడిచి వస్తూంటే వారంతా పాడుకుంటూ ఏ తెల్లవార గట్టకో శిబిరానికి జేరుకునేవారు. బస్సులపై యెక్క నిరాకరించితే బలవంతాన ఎక్కించుటకు ఆడపోలీసులనుకూడా నియమించారు. ఒక్కొకపుడు వీరిని అరెస్టు చేసిసబ్ జైలులో 2 రోజులు వుంచి విడుదల చేసేవారు. ఎలాగైనా యీలాతనపెట్టి ఉద్యమంలో నుంచి విరమించేటట్లు చేదామని పోలీసులు ప్రయత్నిస్తే, వారికే విసుకు పుట్టించేది సుమిత్రమ్మ. పోలీసువారు ఎన్ని ఆటంకాలు కల్పించినా ఆమె చాలా గ్రామాల్లో జాతీయ వారం జయప్రదంగా జరిపించింది.

చివరకు విసికి వేసారి సుమిత్రమ్మను అరెష్టుచేసి సబ్ జైలులో నుంచారు. ఆమె భారతదేశము నాదేరా! భారతీయుడనేనేరా అని సన్నని గొంతుతో పాడుతూంటే ఆఫీసులో వాళ్ళంతా నివ్వెరపోయేవారు. ఒకసారి సర్కిలు ఆఫీసుపని జరుగుటలేదని కోపంతో ఆమె వున్న సెల్ (కొట్టు) ఎదుటకివచ్చి "సుమిత్రమ్మా నీవు మగవాడవై పుట్టి లంగోటీ కట్టవలసిన దానవు" అన్నాడు. వెంటనే ఆమె అపుడు నీబోటివారు చీరకట్టి గాజులు తొడిగించుకోవాలిసి వచ్చేది" అంది. మళ్లా తలయెత్తలా సర్కిలు.

విచారణచేసి సంవత్సరం శిక్షవేసి జైలుకు పంపారు సుమిత్రమ్మను. జైల్లో తాను యెన్నో బాధలుపడి, ఉపవాసాలు చేసి జైలు అధికారుల ఏడ్పించి, శిక్ష పూర్తిగా అనుభవించి బయటికివచ్చింది సుమిత్రమ్మ. అప్పటికపుడే గాంధిగారు శాసనోల్లంఘనాన్ని దిగవిడిచి హరిజన సమస్యను పైకి తెచ్చారు. హరిజనులకు దేవాలయ ప్రవేశ హక్కుకొరకు కాంగ్రెసువారు ప్రచారం చేస్తున్నారు.

సుమిత్రమ్మ తన సహజ వుత్సాహశక్తులతో తన వూల్లో ప్రచారం సాగించింది. గ్రామంలో ప్రజలు చాలామంది హరిజనుల దేవాలయప్రవేసానికి సుముఖులయ్యారు. కాని ధర్మకర్తలు ఒప్పుకోలేదు. అంతట ఆమె ప్రజలందరివద్దనుండి సమ్మతుల తీసికొంది. నూటికి ఎనుబదిమంది దేవాలయప్రవేసానికి అనుకూలురే. కాని, లాభం! ధర్మకర్తలు ప్రజాభిప్రాయాన్ని లెక్కచేయనపుడు.

అయితే సుమిత్రమ్మ స్వభావంలో ఏపనిని సగంలో విడచుట కానివని. దేవాలయం ముందు ఉపవాసాలు చేయడం మొదలుపెట్టింది. హరిజనులు దేవాలయంలో

ప్రవేశించింది అహారం ముట్టనని ప్రతినచేసింది. పదిహేను రోజులుపవాసం జరిగింది. ఒకసారి స్మారకం తప్పింది. ప్రజలంతా ధర్మకర్తలను దూషించారు. వారు ప్రజాభిప్రాయానికి భయపడి అనుమతించారు. ఈసారి జయం సుమిత్రమ్మదే. ఉపవాసం మానివేసిందామె.

* * *

సుమిత్రమ్మ దేశ స్వతంత్రంకొరకు పోరాటంలో పాల్గొని ఖ్యాతి పొందింది. తోడి దేశీయులచేతనే అణచివేయబడిన హారిజనుల హక్కులకొరకు పోరాడి దూషణాభూషణాకూడా పొందింది. కాని ఇకనో ?......

సుమిత్రమ్మకు భర్త వారసులు మనోవర్తి యిస్తూవుండేవారు. కాని మనోవర్తి పుచ్చుకోడం హీనంగా కనబడిందామెకు. తన భర్త ఆస్థిని న్యాయంగా తానే అనుభవించాలి. ఇట్లాగే అనేకమంది స్త్రీలు తమకు ధర్మంగా చెందాలసిన ఆస్థిని వారసు లనుభవించగా, మనోవర్తితో జీవితాన్ని గడపటం దుర్భరంగా తోచిందామెకు.

వారసుడైన మరదితో తన భర్తభాగం తనకివ్వాలని పోరాడింది. పొలంలో కోతకు అడ్డము తగిలింది. కాని ఆమె లేనిసమయంజూచి, కోతకోసి కుప్పవేసారు. సుమిత్రమ్మ కుప్పలో తనకు భాగంవుందని పేచీపెట్టింది. కాని ఆమెకు ఎవరూ సాయంచేయలేదు. పైగా యిదివరకు భూషించినవారే దూషించమొదలెట్టారు జాయింటు కుటుంబంలో భర్త చనిపోయిన తరువాత విధవకు ఆస్థిపై హక్కేమిటన్నారు. 'లా' లేదు గాన సుమిత్రమ్మ పోరాడటం 'తెలివి తక్కువ' 'పిచ్చ' అన్నారు. కాని ఆమె 'శాసనాలతో లెఖ్ఖ ఏమిటి ? ధర్మాన్ని సాధించాలి,' అనుకొంది. చాటుగా కుప్పకొట్టుకు పోవాలని మరది ప్రత్నాలు తెలుసుకొంది. ఏవిధంగానైనా ధాన్యం అతనికి చెందకుండా చెయ్యాలనుకుంది. ఆధాన్యపు కుప్పకు నిప్పంటించి భస్మంచేసింది.

తా చేసినపని సుమిత్రమ్మ నిర్భయంగా ప్రజలందరికీ చెప్పింది. కొందరామెకు పిచ్చెక్కిందన్నారు. కొందరు మదించి అలాంటి పనులు చేస్తూందన్నారు. రిపోర్టు ననుసరించి పోలీసులు అరెష్టుచేసి సబ్ జైలులో పెట్టారు. ప్రజలంతా సుమిత్రమ్మ కుప్ప తగుల బెట్టి జైల్లో పడిందని విపరీతంగా చెప్పుకుంటున్నారు. మిత్రులు రాజీపడి కేసు ఎత్తివేయునటుల చేదామని ప్రయత్నించేసారు. న్యాయాధికారి 'తానేమీ ఎరుగనని' చెప్పితే, కేసు కొట్టివేస్తానన్నాడు. కాని వీనిలో దేనికీ సుమిత్రమ్మ ఒప్పుకోలా. 'తన భర్త ఆస్థిని స్త్రీ అనుభవించడం ధర్మం కాదా! అందులకు విరుద్ధంగా కలిగే ఆటంకాలను ఆమె యెదుర్కోడంలో తప్పేముంది. అందుకొరకు జైలుకు పోతే మాత్రం తప్పేమి,' అని ఆమె వాదన.

అనుమతిపొంది నేనూ, సోదరి మంగమ్మ సుమిత్రమ్మను చూడడానికి సబ్ జైలుకు పోయాము. నేను సుమిత్రమ్మతో అన్నాను. "మీరిలా చేయడం బాగుండలేదు. స్త్రీలకు ఆస్థి హక్కులు సంపాదించాలంటే, బలమైన ప్రచారం స్త్రీలమధ్య చెయ్యాలి. స్త్రీజనమంతా ఉద్యమంలో పాల్గొని పోరాడేటట్లు చెయ్యాలి.

సుమిత్రమ్మ:—సాగని మాటలు చెప్పవద్దు. స్త్రీలంతా పురుషుల ఆధీనంలో వున్న బానిసలు ప్రచారకుల మాటలు వారిచెవుల్లో దూరవు. అసలు పురుషులు మాబోంట్లను వారిదగ్గఱకే పోనివ్వరు. కాన వారి హృదయాల్లో ఆవేశం పుట్టించి, పులకాంకితులచేసి, వారి స్థితిని ఆలోచించుకొనేటట్లు చేసే, ఉత్తేజకరమైన పనులు చెయ్యాలిసిందే.

నేను:—లాభమేముంది, వృధా కష్టమేగాని. ప్రచారంద్వారా శక్తులన్నిటిని సంఘటితంచేసుకోవాలి. ఆందోళనచేసి శాసనం మార్పించాలి.

సోదరి మంగమ్మ:—అన్నయ్యా! నీవుకూడా పాలకుల దృక్పధంతోనో చూస్తున్నావు. అధికారం చెలాయించేవారు శాసనాలను, తమ అధికారాన్ని నిలబెట్టు

కోడానికే చేస్తారు. వాటినుంచి కష్టనష్టాలు పడేవారు ఎపుడూ ప్రార్థనలవలన, శాసనాలను తమ కనుకూలంగా మార్పించుకోజాలరు. అందువల్లనే విప్లవాలు తప్పని సరి అవుతాయి.

ఏదో నేను సుమిత్రమ్మను లాంగదీస్తానని మాట్లాడనిస్తున్న ఇన్‌స్పెక్టరు సోదరిమాటలతో కరకు మీరి "టైము అయిపోయింది. ఇక చాలించండ"న్నాడు.

విచారణ జరిగింది. నిప్పంటించి ఆస్థికి నష్టము కలిగించినదని కఠినశిక్ష విధించారు. సుమిత్రమ్మకు రాయవెల్లు వెంటనే పంపించారు.

ఇపుడు సుమిత్రమ్మపేరు తలచేవారే లేదు. ఇప్పటికీ సోదరి మంగమ్మ నన్ను దెప్పుతూనే వుంటుంది, "స్త్రీలను సత్యాగ్రమోద్యమంలోనికి రానివ్వడం, పురుషులుకోరి ఆజ్ఞాపించి చేయించే అన్ని పనులవంటిదే గాని, స్వతంత్ర చిహ్నంకాదు! కాంగ్రెసువారు నిజంగా స్త్రీ స్వాతంత్ర్యాన్ని అభిలషించితే, సత్యాగ్రహి సుమిత్రమ్మను కీర్తించి ఆకాశాన కెత్తినవారు, స్త్రీల ఆస్థి హక్కులకై పోరాడి జైలుకు వెళ్ళిన సుమిత్రమ్మనుగురించి యోజింపనైనా యోచింపరేం? ప్రజలకేదో మేలు చేస్తామని అశెంబ్లీకి వెళ్ళిన కాంగ్రెసువారు, డైవోర్సుశాసనం, స్త్రీలకు ఆస్థిపై హక్కునిచ్చేశాసనంగావించడానికి ప్రయత్నించరేం అని.

## ధర్మం

పండూగంటూ,
పబ్బామంటూ;
దేవుడొచ్చీ,
దేవూరిస్తే;

గారెలుగారెలు!
బూరెలుబూరెలు!!
పారావేసీ,
పంపేస్తావా?

చాకిరిచేసీ,
చెమట వోడ్చీ;
రాత్రింబగళ్ళు,
రక్తామోడ్చీ:

ఆకాలంటూ:
అన్నామంటూ;
దాహామంటూ,
'దప్పి' కంటూ;

కూలీ వచ్చీ,
గోలా బెడితే;
కాలాదన్నీ,
నెలా రాస్తావా?

—తుమ్మల వెంకటరామయ్య